రెప్పపడితే మృత్యు ఒడికే..

- జాతీయ రహదారిపై రెప్పపాటులో ప్రమాదాలు
- జగ్గంపేట సర్కిల్ పరిధిలో మూడేళ్లలో 216 యాక్సిడెంట్లు
- 124 మంది మృతి, 216 మందికి గాయాలు



హైవేపై లైట్లు వెలగకపోవడంతో అలుముకున్న చీకట్లు

జగ్గంపేట: జాతీయ రహదారిపై రెప్పపాటులో జరిగే ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలే ఎక్కువ. గత మూడేళ్లలో జగ్గంపేట పోలీసు సర్కిల్ పరిధిలో 216 ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 124 మంది మృతి చెందగా, 167 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గత మూడేళ్లలో సరాసరి చూస్తే ఏడాదికి 40 నుంచి 42 మంది ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

గ్రామాల్లో రోడ్డు క్రాసింగ్‌ల వద్ద సరైన ఖాళీ లేకపోవడం, రాత్రి సమయాల్లో హైవేపై లైట్లు సక్రమంగా వెలగకపోవడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నట్టు పోలీసులు గుర్తించారు. జిల్లా ఎస్పీగా రవీంద్రనాథ్ బాబు బాధ్యతలు చేపట్టిన తరువాత జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. అక్కడ ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. దీంతో పరిస్థితి కొంత మేర మెరుగుపడిందనే చెప్పాలి. పోలీసులు అర్ధరాత్రులు జాతీయ రహదారులపై గస్తీ నిర్వహించి డ్రైవర్లను అప్రమత్తం చేస్తున్నారు. ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే అథారటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు సక్రమంగా చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

జగ్గంపేట సర్కిల్ పరిధిలో హైవేపై గత మూడేళ్లలో జరిగిన ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మరణించిన వారు	గాయపడ్డవారు
2020	72	35	51
2021	83	48	64
2022	62	37	52

సర్కిల్ పరిధిలో..

జగ్గంపేట పోలీసు సర్కిల్ పరిధిలోని జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. మొత్తం 23 కిలో మీటర్ల మేరు పదహారో నంబర్ జాతీయ రహదారి విస్తరించి ఉంది. దీనిలో గండేపల్లి పోలీసు స్టేషన్ పరిధి ఎక్కువ. బ్లాక్ స్పాట్స్ గండేపల్లి పరిధిలో 4, కిర్లంపూడి పరిధిలో 2,జగ్గంపేట పరిధిలో 2 ఉన్నాయి. జగ్గంపేటలో జేవీఆర్ సెంటర్, ఆదిత్య హాస్పటల్ వద్ద ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి. ఇక్కడ రోడ్డు దాటే వాహనాలు చాలా ఎక్కువ. హైవేపై లైట్లు సక్రమంగా వెలగకపోవడంతో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామస్తులు ఆందోళనలు చేపట్టిన సందర్భాలు ఉన్నాయి. దీనిపై స్పందించిన హైవే అధికారులు ఇటీవల హైవేపై లైట్లకు మరమ్మతులు చేశారు.



బొర్రంపాలెం వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన యువకుడిని ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు (ఫైల్)



హైవేపై ఇటీవల జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి, రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రమాదాల నివారణకు చర్యలు



హైవేపై జరిగిన ప్రమాదాల్లో ఏడాదికి 40 మంది చనిపోవడం బాధను కలిగిస్తోంది. జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు సూచనలతో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు అనేక సార్లు రాత పూర్వకంగా లెటర్లు పంపాం. ఒకటి రెండు సార్లు వచ్చి అన్ని పరిశీలించారు. కొన్ని చర్యలు మాత్రమే చేపట్టారు. ప్రధానంగా ప్రమాదాల జరిగే ప్రాంతాల్లో సెంట్రల్ లైటింగ్ కచ్చితంగా వెలిగేలా చూడాలి. హైవేపై మెయిటిౕనెన్స్ పనులు చేసేటపుడు చాలా దూరం కోన్‌లు పెడుతున్నారు. దీనివల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. – బి. సూర్యఅప్పారావు, జగ్గంపేట సీఐ

అధికారుల నిర్లక్ష్యమే కారణం



జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. దీనికి కారణం కేవలం హైవే అధికారుల నిర్లక్ష్యమే కారణం. గండేపల్లి మండలం తాళ్లురుకు చెందిన దంపతులు హైవేపై జరిగిన ప్రమాదంలో మృతి చెందగా వారి పిల్లలు అనాథలుగా మిగిలారు. ఇలాంటి సంఘటనలు ఎన్నో. అధికారులు చిత్తశుద్ధితో చర్యలు చేపడితే ప్రమాదాలను నివారించవచ్చు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు రాత్రి సమయంలో రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవలసి వస్తోంది. – పులి ప్రసాద్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ, యర్రంపాలెం, గండేపల్లి మండలం

క్లుప్తంగా

ట్రస్టుబోర్డు సభ్యుడు చిట్టిబాబుకు సన్మానం



ఏలేశ్వరంలో చిట్టిబాబును సన్మానిస్తున్న చైర్‌పర్సన్ దంపతులు

ఏలేశ్వరం: అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడిగా ఇటీవల నియమితులైన దళే చిట్టిబాబును పట్టణంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్ అలమండ చలమయ్య దంపతులు చిట్టిబాబును శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నవరం దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడిగా చిట్టిబాబును నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించేలా కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు అలమండ దుర్గావెంకటప్రసాద్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అలమండ వీరరాఘవస్వామి, గెడ్డం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ



ఏలేశ్వరంలో శివపార్వతులకు పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు నది సమీపంలో ఆదివారం బల్లల పండగ ఘనంగా నిర్వహించారు. స్థానిక దిబ్బలపాలెం రజక సంఘం అధ్యక్షుడు అంజూరి రాజారావు ఆధ్వర్యంలో శివపార్వతుల చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. మధ్యాహ్నం వందలాది మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, దాకమర్రి లోవరాజు, సామంతుల సూర్యకుమార్, కోరాడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత ప్రభుదాసు మృతి



ప్రభుదాసు(ఫైల్)

కోటనందూరు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, స్థానిక 8వ వార్డు మెంబర్ నందిక ప్రభుదాసు(60) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. ఆయనకు 15 రోజుల క్రితం గుండెనొప్పి రావడంతో వైజాగ్ ఎన్నారై ఆసుపత్రిలో చేరి స్టంట్లు వేయించుకుని ఇటీవల డిశ్చార్జ్ అయ్యారు. మరోమారు గుండె నొప్పి రావడంతో గత శుక్రవారం సాయంత్రం అదే ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. వివాదరహితుడైన ప్రభుదాసు వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవారు. గత పంచాయతీ ఎన్నికల్లో 8వ వార్డు నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ప్రభుదాసు మృతి పట్ల ఎంపీపీ లగుడు శ్రీనివాసు, తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, కురందాసు రాంబాబు, ఉల్లూరి శ్రీను సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం–వెల్దుర్తి రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కాకినాడకు చెందిన అనిల్‌కుమార్ కరప మండలం కరప, నడకుదురు గ్రామాలకు చెందిన మరో ఇద్దరితో కలిసి ద్విచక్ర వాహనంపై ధర్మవరం వచ్చారు. తిరిగి వెళ్తుండగా ధర్మవరం–వెల్దుర్తికి మధ్యలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దిచక్ర వాహనం నడుపుతున్న అనిల్ కుమార్‌కు కాలు విరిగిపోగా, మరో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమాలను బయటపెడతా

జగ్గంపేట: నియోజకవర్గ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ఆయన తండ్రి రామస్వామి చేసిన అవినీతి, అక్రమాలను సీరియల్స్‌గా ప్రతివారం బయటపెడతానని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే చంటిబాబు, అతని తండ్రి రామస్వామి మామిడాడ సొసైటీలో రూ.90 లక్షల రుణాలను రైతుల పేరిట తీసుకుని గోల్‌మాల్ చేశారని ఆరోపించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన రుణమాఫీలో అవి మాఫీ అయ్యాయన్నారు. అలాగే ఎమ్మెల్యే గండేపల్లి మండలం రామేశ్వరంపేటలోని 154 ఎకరాల్లో గల గుల్లమెట్ట కొండను గ్రావెల్ తరలింపునకు ఒక ఎకరాకు పది లక్షల చొప్పున తీసుకున్నారని విమర్శించారు. దీనిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు



లోవ మెట్ల మార్గంలో వేస్తున్న చలువ పందిళ్లు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం లోవ దేవస్థానంలో వేసవి చలువ పందిళ్లు వేస్తున్నారు. మెట్ల మార్గంలో పెద్ద అమ్మవారి విగ్రహం వద్ద ఇటీవల బాలాలయం నిర్మించడంతో భక్తులు దర్శించుకుంటున్నారు. క్యూ లైన్లలో వేచి ఉండి అమ్మవారిని దర్శించే భక్తులు ఎండ దెబ్బ బారిన పడుతున్నారు. దీంతో బాలాలయం వరకూ తాటాకులతో చలువ పందిళ్లు వేస్తున్నట్టు లోవ దేవస్థానం ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఏటా మార్చిలో వేసే చలువ పందిళ్లను ఈ ఏడాది భక్తుల సౌకర్యార్థం ఫిబ్రవరిలోనే రూ.1.50 లక్షలతో వేస్తున్నట్టు చెప్పారు. రెండు రోజుల్లో పందిళ్లు వేసే పనులు పూర్తవుతాయని వివరించారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం



కొండవారిపేటలో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సరకులు అందిస్తున్న ఓం ఫౌండేషన్ సభ్యులు

శంఖవరం: మండలంలోని కత్తిపూడి కొండవారిపేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ఓం ఫౌండేషన్ సభ్యులు చేయూతను అందించారు. బాధితురాలు వల్లూరి సత్యవతి కుటుంబానికి నిత్యావసరాలు, బియ్యం, కిరాణా సరకులు, చాపలు, దుప్పట్లు, దుస్తులు, నగదు అందజేశారు. బాధితులను ప్రభుత్వంతో పాటు మిగతా స్వచ్ఛంద సేవా సంస్థలు ఆదుకోవాలని కోరారు. ఓం ఫౌండేషన్ సభ్యులు సుర్ల శ్రీను, మెగిలి శ్రీను, అవాల శ్రీను, కొరుప్రోలు ప్రసాద్, షేక్ జిలానీ పాల్గొన్నారు.



శరభవరం, గజ్జనపూడి గ్రామాల భక్తులు చేపట్టిన గిరియాత్ర

వైభవంగా గిరి ప్రదక్షిణ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని శరభవరం, గజ్జనపూడి గ్రామాలకు చెందిన భక్తులు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి కొలువైన ఎర్రకొండ చుట్టూ ఆదివారం గిరియాత్ర (గిరి ప్రదక్షిణ)నిర్వహించారు. శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, వాకపల్లి, పోతులూరు మీదుగా 13 కిలో మీటర్లు మేర గిరి యాత్రను చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగాణంలో భారీ అన్నదానం నిర్వహించారు. శరభవరం, గజ్జనపూడి పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కిర్లంపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలిసిన 1992-93 బ్యాచ్ విద్యార్థులు

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు 30 ఏళ్ల తరువాత తాము విద్యను అభ్యసించిన పాఠశాలలోనే కుటుంబ సమేతంగా కలుసుకున్నారు. ఒకరినొకరు పరిచయం చేసుకుని, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాము చదువుకున్న తరగతి గదుల్లో కలియ తిరుగుతూ అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. మధ్యాహ్నం స్నేహితులందరూ ఒకేచోట కూర్చొని సహపంక్తి భోజనాలు చేశారు. తొలుత తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. పాఠశాల ఆవరణలో ఆటపాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మండపాక చలపతిరావు, సికటాపు వెంకట కృష్ణారావు, తూము పెద్ద, ఆళ్ల రామశివ, యల్లపు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లింగోద్భవ పూజలు

ప్రత్తిపాడు: మహాశివరాత్రిని పురస్కరించుకుని స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి పంచాయతన ఆలయంలో శనివారం అర్ధరాత్రి లింగోద్భవ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో రుత్విక్కులు స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. ఆదివారం తెల్లవారు జాము నుంచి వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త తేజోమూర్తుల వీరభద్రప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎంవీ రామరాజు వర్మ, రావూరి తాతాజీ, చామర్తి వీరబాబు, వేదగాయత్రి బ్రహ్మణ సంఘం ప్రతినిధి అనిసంగరాజు కుక్కుటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహా శివలింగాన్ని దర్శించుకున్న భక్తులు

ప్రత్తిపాడు ఈశ్వరీయ విశ్వవిద్యాలయం రాజయోగ శిక్షణాలయంలో బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన మహా శివలింగాన్ని ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జి వెంకటరత్నం మహా శివలింగాన్ని దర్శించి పూజలు చేశారు.

శివబాలయోగీశ్వరీదేవి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

తొండంగి: మహా శివరాత్రిని పురస్కరించుకుని శృంగవృక్షంలోని శివబాలయోగీశ్వరీదేవి ఆశ్రమంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒడిశాకు చెందిన డీకే సాహూ ఆధ్వర్యంలో రుత్వికులు ఆశ్రమంలో గణపతి పూజ, రుద్రాభిషేకం, రుద్ర హోమం, శివపూజ, యోగీశ్వరీదేవికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఒడిశా, జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్తిపాడులో విశ్వేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న పండితులు

నేడు సూర్యభగవానుడికి అరుణ హోమం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం సూర్య భగవానుడికి అరుణ హోమం నిర్వహించనున్నట్టు దేవస్థానం చైర్మన్ కోలా భీమేశ్వరరావు ఆదివారం తెలిపారు. మాఘమాసం సందర్భంగా ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించే హోమం ప్రత్యేక పూజల్లో భక్తులు భాగస్వామ్యం కావాలని కోరారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం

తుని: విజయం చిన్నదైనా స్ఫూర్తి ఉజ్వలంగా ఉంటుందని శ్రీప్రకాష్ విద్యాసంస్థల కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ అన్నారు. స్థానిక శ్రీప్రకాష్‌లో ఆదివారం అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర, జిల్లా, పట్టణ స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్య, సాంస్కృతిక, క్విజ్, ఆట పాటలు, పోటీ పరీక్షలు, సైన్స్ కాంగ్రెస్ తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విజయ్ ప్రకాష్ సత్కరించారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు గాను జ్ఞాన సముపార్జనకు అవసరమయ్యే పుస్తకాలను బహూకరించారు. ప్రిన్సిపాల్స్ మూర్తి, వీర్రాజు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న విజయ్‌ప్రకాష్

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన లంపకలోవ కరాటే స్కూల్ విద్యార్థులు

ప్రత్తిపాడు: జగ్గంపేట ప్రభుత్వోన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో లంపకలోవ కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో బూన్ కరాటే అకాడమీ నిర్వహించిన ఈ పోటీల్లో లంపకలోవ కరాటే స్కూల్ నుంచి 18 మంది పాల్గొనగా అందరూ విజేతలుగా నిలిచారని కరాటే మాష్టారు పి.బుజ్జి తెలిపారు. ఈ పోటీల్లో పి.అర్జున్ (రాచపల్లి), జి.తేజ (ఒమ్మంగి), ఎస్.కృష్ణ, ఆర్.పృథ్వీ, (గోకవరం), ధర్మవరం గ్రామానికి చెందిన కె భరణి, ఫణీంద్రలకు ప్రథమ స్థానం లభించిందన్నారు. ఒమ్మంగి గ్రామానికి చెందిన జె.అలేఖ్య, ఎస్. సాయి, రాచపల్లికి చెందిన ఆర్.గౌతమి, ధర్మవరం గ్రామానికి చెందిన డి.సాయి, జె.వైష్ణవిలకు ద్వితీయ స్థానం, తృతీయ స్థానంలో ఎస్.ప్రవీణ్ (రాచపల్లి), ఒమ్మంగికి చెందిన జి.హర్ష, జి.వరుణ్, గోకవరానికి చెందిన కె.బాబు, ధర్మవరం గ్రామానికి చెందిన పి.కుసుమాంజలి, డి.రమణ నిలిచారని ఆయన వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయా గ్రామాల నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు



ఏలేశ్వరంలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు పట్టణంలో ఆదివారం ఘనంగా జరిగాయి. బీజేపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు గెట్టం వెంకటరమణ, ఏనుగు ధర్మరాజు ఆధ్వర్యంలో స్థానిక బాలాజీచౌక్ వద్ద శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివాజీ పోరాట ప్రతిమను కొనియాడారు. శివాజీని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈగల వెంకటేశ్వరరావు, రెడ్డి లోవరాజు, గొల్లపూడి సత్యనారాయణ, రాతికింది కృష్ణారావు, కురాకుల రాజా, అడపా శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్సై రాత పరీక్షలు

- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు
- అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిన ఆర్టీసీ



ఆదిత్య కళాశాలలో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు



ప్రగతి కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఆదివారం ఎస్సై రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కాకినాడ జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు వచ్చే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. అభ్యర్థులు ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా సకాలంలో పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. 100 మంది పోలీస్ సిబ్బందితో పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగినట్టు తెలిపారు. పరీక్షల నిమిత్తం వచ్చిన అభ్యర్థులకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిందన్నారు. ఆదిత్య ఇంజినీరింగ్ క్యాంపస్‌లోని 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉదయం 10 గంటలకు జరిగిన పరీక్షకు 5650 మందికి గాను 5118 మంది అభ్యర్థులు, ప్రగతి క్యాంపస్‌లో 1152 మందికి గాను 1028 మంది పరీక్షలు రాశారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగిన పరీక్షలకు ఆదిత్యలో 5650 మందికి గాను 5114 మంది, ప్రగతిలో 1152 మందికి గాను 1027 మంది హాజరైనట్టు ఎస్సై వై.గణేష్ కుమార్ తెలిపారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) పి.శ్రీనివాస్, పెద్దాపురం డీఎస్పీ సుంకర మురళీ మోహన్, జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

శంఖవరం: జాతీయ రహదారిపై మండలంలోని కత్తిపూడి వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో మహిళ మృతి చెందింది. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా పాయకరావు పేట అంబేడ్కర్ కాలనీకి చెందిన షేక్ గౌషి(30) తన భర్త, కుమారుడితో కలిసి రాజమహేంద్రవరం ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా కత్తిపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ వద్ద తుని నుంచి వస్తున్న టాటా మేజిక్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షేక్ గౌషి అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె భర్త షేక్ కరీమ్, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షత గాత్రులను తుని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పంచనామ నిమిత్తం తుని ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

జగనన్న కాలనీల్లో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు

తుని రూరల్: మండలంలోని లోవకొత్తూరు శివారు కొత్తవెలంపేట సమీపంలో తుని పట్టణ వాసులకు కేటాయించిన జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడ 4600 మందికి ఇళ్లస్థలాలు మంజూరు చేసిన ప్రభుత్వం పట్టాలు సైతం పంపిణీ చేయడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మించుకుంటున్నారు. వేసవి నేపథ్యంలో ఆటంకం లేకుండా నిర్మాణ పనులు జరుగుతున్నాయని లబ్ధిదారులు తెలిపారు. పనులు పూర్తయి గృహ ప్రవేశాలు జరిగితే ఆ ప్రాంతంలో మరో గ్రామం (జగనన్న కాలనీ) ఆవిర్భవించనుంది. తుని మున్సిపల్ చైర్ పర్సన్ ఏలూరి సుధారాణి, కో ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువత అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు. లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారు.



లోవకొత్తూరు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు